జర్నలిస్ట్
నిఘా
కలం.. మా బలం..
189 కాకినాడ బుధవారం 11 ఏప్రిల్ 2018

# వర్సిటీ ముద్రకోసం తాపత్రయ పడండి

## అధికార్లకు ఇన్‌చార్జి వీసీ ఉద్బోధ



**కాకినాడ(నిఘా ప్రతినిధి) :** ఏ విశ్వవిద్యాలయానికైతే ప్రవేశాలు ఎక్కువ శాతం జరుగుతాయో ఆ విశ్వవిద్యాలయం తనదైన ముద్రను ఏర్పర్చుకుంటుందని ఆ దిశగా జేఎన్‌టీయూ కాకినాడను నడిపించాలని ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన వీసీ మంగళవారం నాడు సెనేట్ హాల్లో ముఖ్య విభాగాల అధిపతులతో తొలి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన వర్సిటీ అధికారులనుద్దేశించి యూనివర్శిటీలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని దానిని అవలంబించేందుకు మరియు విద్యార్థులకు శిక్షణనిచ్చేందుకు గట్టి చర్యలు చేపట్టాలన్నారు. థియరీపై కాకుండా ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించేలా ప్రయత్నం చేయాలని, విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించాలని, వర్చువల్ ల్యాబ్‌లను అభివృద్ధిపర్చాలని కోరారు. ముఖ్యంగా వ్యవస్థాపకతకు ఎక్కువ ప్రాముఖ్యతనివ్వాలన్నారు. విద్యార్థులు ఉద్యోగాలకై పాకులాడకుండా వ్యవస్థాపకులుగా ఎదిగేందుకు ఇది ఎంతగానో తోడ్పాటునందిస్తుందని ఈ కారణంగా ప్రోత్సహించాలన్నారు. అంతకుముందు వర్సిటీ ఆవరణలో ఉన్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కాన్ఫరెన్స్ హాలు నందు జెఎన్‌టియుకె అధికారులతో జరిపిన భేటీలో పై విధంగా ఉద్బోధచేశారు. ఈ సమావేశంలో పరిచయాల అనంతరం ఆయన డైరెక్టరేట్ల వారీగా పరిపాలనా విధానాన్ని, అవలంభిస్తున్న విధి విధానాలను కూలంకషంగా తెలుసుకున్నా రు. దీనికి తగ్గట్టుగానే ఆయన డైరెక్టర్లకు కొన్ని సలహాలు, సూచనలు అందించారు. ముందుగా డైరెక్టర్లనుద్దేశిస్తూ ప్రతీ అధ్యాపకుడు వృత్తికి అంకితభావంతో సేవ చేయాలని, యూనివర్శిటీని ఉన్నత శిఖరాలకు చేర్చేలా తమ వంతు ప్రయత్నాలను మెరుగుపర్చుకోవాలన్నారు. క్రీడలలో ఆసక్తి చూపే విద్యార్థులకు రెండు క్రెడిట్స్ అదనంగా ఇవ్వాలని, రూ. 2వేలు ఫెలోషిప్ ఇచ్చేలా ప్రయత్నాలు చేయాలన్నారు. **(మిగతా 2వ పేజీలో)**

# వర్సిటీ ముద్రకోసం తాపత్రయ పడండి

(మొదటి పేజీ తరువాయి)

క్యాంపస్‌లో గ్రీన్ ఫెన్సింగ్ సిస్టమ్‌ను అభివృద్ధిపర్చి పర్యావరణ పరిరక్షణకై పాటుపడాలన్నారు. పరిసర ప్రాంత పరిశ్రమలతో అనుసంధానమై ఇండస్ట్రీ ఇంటరాక్షన్ కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. మహిళా సాధికారతను పెంపొందించేందుకు గృహిణులకు కంప్యూటర్ శిక్షణను ఉచితంగా అందించేలా రూపకల్పన చేయాలన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్‌లో విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించి వారి సృజనాత్మకతను ఒడిసి పట్టుకుని అంకురార్పణలకు, అన్వేషణలకు, పరిశోధనలకు పెద్దపీట వేయాలని ఇన్‌ఛార్జి విసి రామకృష్ణారావు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ కె. పూర్ణానందం, ఓఎస్‌డి కెవి. రమణ, రిజిస్ట్రార్ వివి. సుబ్బారావు, డైరెక్టర్‌లు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.